

**చీనీ టన్ను రూ.32,500**
అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32,500 పలికాయి.



**కిలో టమాట రూ.10**
స్థానిక కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికినట్లు ఏడీఎం పి.సత్యనారాయణచౌదరి, రాప్తాడు సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
42.9°/ 17.8°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఎండతీవ్రత పెరిగింది. గాలి వేగం తగ్గడంతో ఉక్కపోతతో జనం ఇబ్బందులు పడ్డారు. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

**రంజాన్ వేళలు**

| శుక్రవారం | శనివారం |
|---|---|
| ఇఫ్తార్ | సెహరి |
| 6.35 | 4.47 |

# అభివృద్ధి పథం.. సంక్షేమ హితం

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- ఏ పనిలోనూ రాజీ ప్రసక్తే లేదు
- అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ పి.అరుణ్‌బాబు



**కలెక్టర్ ప్రస్థానం ఇలా...**
2007లో టెక్కలి ఆర్‌డీఓగా బాధ్యతలు స్వీకరించారు. తర్వాత నరసరావుపేట, గురజాల, గూడూరు ఆర్‌డీఓగా పని చేశారు. 2014లో ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. తొలుత విశాఖపట్నం జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తూ బదిలీపై శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌గా వచ్చారు.

**సాక్షి, పుట్టపర్తి:** అభివృద్ధి పథకం.. సంక్షేమ హితమే ధ్యేయం... ఏ పనిలోనూ రాజీ ప్రసక్తే లేదు. అందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి బాట పట్టిస్తాం. అర్హులెవరికీ అన్యాయం జరగడానికి వీల్లేదు. విధుల్లో అధికారులు, సిబ్బంది ఎవరూ అలసత్వం వహించకూడదు. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించబోం'. అని జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.అరుణ్‌బాబు అన్నారు. గురువారం 'సాక్షి' నిర్వహించిన ముఖాముఖిలో పలు విషయాలు వెల్లడించారు. ఆయన మాటల్లోనే ఇలా...

**సకాలంలో లక్ష్యం పూర్తయ్యేలా..**
ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి అభివృద్ధి పనిని సకాలంలో పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేస్తాం. ఎక్కడా జాప్యం జరగడానికి వీల్లేదు. హౌసింగ్, నాడు - నేడు, భూముల రీసర్వేతో పాటు 'స్పందన'కు వచ్చిన అర్జీలు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. అభివృద్ధి పనుల్లో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదు.

**పక్కాగా అర్హులందరికీ ఇళ్లు..**
పేదలందరికీ సొంతిల్లు ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగానే స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తున్నాం. ఎన్ని సవాళ్లు ఎదురైనా ఇళ్ల నిర్మాణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ సకాలంలో పూర్తయ్యేలా కృషి చేస్తాం. జగనన్న కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తాం.

**చురుగ్గా 'నాడు – నేడు' పనులు..**
రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో ప్రతిష్టాత్మక మార్పులు తీసుకొచ్చింది. నాడు – నేడు పథకంలో భాగంగా పాఠశాలల ఆధునికీకరణ పనులు చురుగ్గా నిర్వహిస్తాం. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో చదివేందుకు విద్యార్థులు పోటీ పడేలా చేస్తాం. పది పరీక్షల్లో ఈసారి మెరుగైన ఫలితాలు సాధిస్తారని ఆశిస్తున్నాం.

**రీసర్వేపై ప్రత్యేక దృష్టి..**
ప్రభుత్వం ఓ యజ్ఞంలా భావిస్తోన్న భూముల రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఇప్పటికే చాలా గ్రామాల్లో రీసర్వే పూర్తయింది. గడువు లోపు రీసర్వే లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. రీసర్వేతో భూముల వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

**అర్హులకు న్యాయం..**
ప్రభుత్వం అందజేస్తోన్న సంక్షేమ పథకాలన్నీ అర్హులకు అందేలా చూస్తాం. ఎక్కడా అవకతవకలకు చోటు ఉండదు. అర్హులకు అన్యాయం జరగనివ్వం. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ మేలు జరగాలనే సీఎం వైఎస్ జగన్ నినాదాన్ని ముందుకు తీసుకెళ్తాం.



**జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తా..**
రాయలసీమ పరిధిలో విధులు నిర్వర్తించడం ఇదే తొలిసారి. అయితే శ్రీసత్యసాయి జిల్లాపై అవగాహన ఉంది. మాది ప్రకాశం జిల్లా కందుకూరు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తా.

## నేడు బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు



**పుట్టపర్తి అర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను పుట్టపర్తి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఇతర ప్రముఖులు పాల్గొంటారన్నారు. ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## బీటెక్ ఫలితాల విడుదల



జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షల భవనం

**అనంతపురం:** జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో నిర్వహించిన బీటెక్ రెండో సంవత్సరం మొదటి సెమిస్టర్ (ఆర్–15,ఆర్–19) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంటెక్ మూడో సెమిస్టర్ (ఆర్–17) సప్లిమెంటరీ, మూడో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి తెలిపారు. ఫలితాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.

## ప్రశాంతంగా పది పరీక్షలు



పరిగి మండల కేంద్రంలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

**పుట్టపర్తి టౌన్/పెనుకొండ/నల్లమాడ:** జిల్లాలో పది పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. గురువారం 125 పరీక్షా కేంద్రాల్లో సైన్స్ పరీక్ష జరిగింది. 24,523 మందిగాను 24, 234 మంది పరీక్షకు హాజరయ్యారు. 289 మంది గైర్హాజరయ్యారు. పెనుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో జరుగుతు పది పరీక్షా కేంద్రాలను కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట సబ్‌కలెక్టర్ కార్తీక్ తదితరులున్నారు. మరోవైపు పుట్టపర్తి పట్టణంలో ఉన్న ఎనములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను జాయింట్ కలెక్టర్ టీసీ చేతన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా పదో తరగతి పరీక్షలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. నల్లమాడలోని పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాధికారి మీనాక్షి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్టీ బాలుర ఆశ్రమ, కస్తూరిబా పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి పరీక్షలు జరుగుతున్న విధానాన్ని స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## న్యూస్‌రీల్

### కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



కలెక్టర్ అరుణ్‌బాబుకు మొక్కను అందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

**పుట్టపర్తి అర్బన్:** జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ఎస్పీ మాధవరెడ్డి గురువారం కలెక్టర్ బంగ్లాకు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. కొంత సేపు జిల్లా పరిస్థితులపై చర్చించుకున్నారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ రామకృష్ణప్రసాద్ ఉన్నారు.

**కలెక్టర్‌ను కలిసిన జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్**
జిల్లా నూతన కలెక్టర్ అరుణ్‌బాబును జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి గురువారం కలెక్టర్ చాంబర్‌లో కలిసి సన్మానించారు. జిల్లాలో వ్యవసాయ భూములు, ఏఏ పంటలు పండిస్తున్నారు? తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నట్లు రమణారెడ్డి చెప్పారు.

### వీఆర్‌ఏల జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులు

**పుట్టపర్తి అర్బన్:** జిల్లా వీఆర్‌ఏల నూతన కార్యవర్గం గురువారం పుట్టపర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య, ఏపీజేఏసీ అధ్యక్షుడు మైనుద్దీన్, రాష్ట్ర కార్యదర్శి సీతారాముడు, ట్రెజరర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా పూజారి చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, ట్రెజరర్ నరసింహులు, ఉపాధ్యక్షుడిగా మహేష్, నాగేంద్ర, నాగప్ప, జాయింట్ సెక్రెటరీలుగా శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, రంగనాథప్ప, డైరెక్టర్లుగా వెంకటలక్ష్మి, గిడ్డనాగప్ప, ఎన్.నాగప్ప, రమేష్, శ్రీకాంత్, కదిరప్ప, ఈశ్వరమ్మ, కార్యవర్గ సభ్యులుగా వెంకటరమణ, శ్రీనివాసులు, గంగాధర్‌ను ఎంపిక చేశారు.

### జిల్లా పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు



జి.కేతన్న



పి.ఖలీల్‌బాషా



ఒ.రంజిత్‌కుమార్



ఎం.చాంద్‌బాషా

**సాక్షి, పుట్టపర్తి:** జిల్లాలోని పలువురు పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలను ప్రకటించింది. తెలుగు సంవత్సరం – 2023 ఉగాది అవార్డులను రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి విడుదల చేసింది. పోలీసు విభాగంలో ఉత్తమ సేవలు అందించిన వారికి వివిధ పతకాలకు ఎంపిక చేసింది. ముఖ్యమంత్రి శౌర్యపతకం, మహోన్నత సేవా పతకం, ఉత్తమ సేవా పతకం, కఠిన సేవా పతకం, సేవా పతకం అవార్డులను పోలీసు/ఫైర్ పోలీసు విభాగాల వారీగా ప్రకటించారు. ఉత్తమ సేవా పతకానికి జిల్లా పోలీసు విభాగం నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. అలాగే ఫైర్ విభాగం నుంచి ఒకరిని ఎంపిక చేశారు.

**పోలీసు విభాగంలో (ఉత్తమ సేవా పతకం)**
**జి.కేతన్న**, ఏఎస్ఐ, ధర్మవరం వన్‌టౌన్
**పి.ఖలీల్‌బాషా**, హెడ్ కానిస్టేబుల్, స్పెషల్ బ్రాంచ్
**ఒ.రంజిత్‌కుమార్**, కానిస్టేబుల్, దిశ పోలీస్ స్టేషన్, పుట్టపర్తి

**ఫైర్ విభాగంలో (సేవా పతకం)**
**ఎం.చాంద్‌బాషా**, లీడింగ్ ఫైర్‌మన్, పుట్టపర్తి ఫైర్ స్టేషన్

# 487 మందికి పోస్టింగ్





అనంతపురం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ దృశ్యాలు

- ముగిసిన డీఎస్సీ-98 అభ్యర్థుల నియామక కౌన్సెలింగ్
- చివరి రోజు 256 మందికి గాను 22 మంది గైర్హాజరు

**కదిరి/రాప్తాడురూరల్:** అనంతపురం శారదానగర్‌లోని జిల్లా సైన్స్ సెంటర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న డీఎస్సీ–98 క్వాలిఫై అభ్యర్థుల నియామక కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. జిల్లాలో మొత్తం 536 మంది అభ్యర్థులకు గాను తొలిరోజు 280 మందిని కౌన్సెలింగ్‌కు పిలవగా 251 మంది హాజరయ్యారు. 29 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఆధ్వర్యంలో రెండోరోజు కౌన్సెలింగ్‌కు 256 మంది అభ్యర్థులకు గాను 22 మంది గైర్హాజరయ్యారు. 234 మంది హాజరయ్యారు. తొలిరోజు గైర్హాజరైన వారిలో ఇద్దరు అభ్యర్థులు హాజరయ్యారు. వారికి చివరిలో స్థానాలు కేటాయించారు. రెండురోజుల్లో కలిపి మొత్తం 487 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 49 మంది గైర్హాజరయ్యారు.

**అంతా ప్రశాంతం..**
డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థులకు సంబంధించి రెండు రోజుల పాటు జరిగిన నియామక కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగియడంతో విద్యాశాఖ ఊపిరి పీల్చుకుంది. ఏ చిన్న సమస్య తలెత్తకుండా డీఈఓ, సిబ్బంది పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. డీఈఓ మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులు క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. పిల్లలకు విలువలతో కూడిన విద్యనందించి విద్యాశాఖకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో అనంతపురం, గుత్తి డెప్యూటీ డీఈఓలు పద్మవాణి, శంకరప్రసాద్, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్లు శ్రీనాథ్, ఆదినారాయణ, ఏఎస్‌ఓ ఓబుళరెడ్డి, ఏపీఓ నాగరాజు, సమగ్రశిక్ష ఏఎస్‌ఓ గురుమునికృష్ణ, ఏపీఓ నారాయణస్వామి, ఐటీసెల్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

### నేను టీడీపీ మండల కన్వీనర్‌ని



నేను ఓడి చెరువు మండల టీడీపీ కన్వీనర్‌ని. డీఎస్సీ–98లో క్వాలిఫై అయ్యాను. ఉద్యోగం కోసం 25 ఏళ్లుగా మేము పోరాటం చేస్తూనే ఉన్నాము. కానీ ఫలితం దక్కలేదు. సీఎం వైఎస్ జగన్ మాకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు ఉద్యోగ అవకాశం కలిప్పించారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– శంకర్‌నాయుడు, ఓడీ చెరువు

### మనసున్న మారాజు సీఎం జగన్



నేను 98 డీఎస్సీలో క్వాలిఫై అయ్యాను. మా సమస్యను ఆరుగురు ముఖ్యమంత్రులకు చెప్పాము. కానీ పరిష్కారం కాలేదు. సీఎం జగన్ మాకిచ్చిన హామీని నెరవేర్చి రాష్ట్రంలో నాలాంటి ఎంతో మందికి టీచర్ పోస్టులు ఇచ్చి మా అందరి జీవితాల్లో వెలుగులు నింపారు. సీఎం మేలు మరచిపోలేనిది. ఈ విషయంలో సీఎంతో పాటు మాకు సహకరించిన మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిలకు కూడా ధన్యవాదాలు.

– నాగరాజు, కదిరి

### నియామక పత్రాలిచ్చాం



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చాం. కౌన్సిలింగ్ ద్వారా వారికి పాఠశాలలు కూడా కేటాయించాం. 25 ఏళ్లుగా వారు చేస్తున్న న్యాయ పోరాటానికి ఈ ప్రభుత్వం ద్వారా వారికి ఫలితం దక్కింది. ప్రభుత్వానికి, వారు పని చేస్తున్న పాఠశాలలకు మంచిపేరు తీసుకొస్తారని ఆశిస్తున్నా.

– ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డి

# ఎన్నికల నిర్వహణపై సమీక్ష



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ

**పుట్టపర్తి అర్బన్:** వచ్చే సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వెలగపూడి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుండి కలెక్టర్ అరుణ్‌బాబు, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య తదితర అధికారులు పాల్గొన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, పెండింగ్ ఎన్నికల అంశాలు, స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టం, పీవీసీ ఎపిక్ కార్డుల ప్రింటింగ్, సరఫరా, ఓటరుకు స్పీడ్ పోస్టు ద్వారా పంపడం తదితర అంశాలపై సమీక్షించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ సుమోటోగా ఓటర్లను తొలగించరాదని, నోటీస్ ఇచ్చిన తరువాతే సరిచూసుకొని తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ఈఆర్‌ఓ నెట్ 2.0 నెల 17 నుంచి అందుబాటులోకి రానుందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టం ఏర్పాటుకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీప్యాట్ వాటి సంబంధిత పరికరాలు భద్రపరిచేందుకు గోడౌన్లు పూర్తిస్థాయిలో భద్రతా ప్రమాణాల మేరకు అందుబాటులో ఉండేలా చూడాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. క్లెయిముల పెండింగ్ , ఫారం 6, 7, 8 ఎన్నికల కమిషన్ రూల్స్ ప్రకారం సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు తదితరులు పాల్గొన్నారు.

**'స్టోన్ ప్లాంటేషన్'ను వేగవంతం చేయండి**
ఎంపిక చేసిన గ్రామాల్లో చేపడుతున్న భూ రీసర్వేలో సరిహద్దు రాళ్లు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్ కోసం అవసరమైతే అదనపు రోవర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్‌లో శ్రీసత్యసాయి జిల్లాలో లక్ష్యాన్ని అధిగమించినట్లు కలెక్టర్ పేర్కొనడంతో కమిషనర్ అభినందించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పర్యవేక్షించి పూర్తి చేయడానికి కృషి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ టీఎస్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఏడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అంతా సెట్ చేస్తా..

- బాధ్యతలు స్వీకరించిన డీఐజీ అమ్మిరెడ్డి
- గౌరవ వందనంలో సిబ్బందికి మందలింపు



సిబ్బంది బటన్ సరిచేస్తున్న డీఐజీ

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** అనంతపురం రేంజ్ డీఐజీగా ఆర్.ఎస్ అమ్మిరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. నేరుగా డీపీఓకు చేరుకున్న ఆయనకు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 9.30 గంటలకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అదనపు ఎస్పీలు హనుమంతురావు, నాగేంద్రుడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, సరోజ, హరి తదితరులు డీఐజీని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

**చొక్కాకు బటన్ పెట్టి.. సున్నితంగా మందలించి..**
బాధ్యతలు స్వీకరించేందుకు డీపీఓకు చేరుకున్న డీఐజీకి ఏఆర్ సిబ్బంది గౌరవ వందనం చేశారు. అయితే, సిబ్బందిలో ఇద్దరు చొక్కా కాలర్ గుండీ పెట్టుకోకపోవడాన్ని గమనించిన డీఐజీ.. వారిని సున్నితంగా మందలించారు. స్వయంగా బటన్లు పెట్టి పొరపాట్లను చక్కదిద్దారు. 'ఉద్యోగాలు మరిచిపోయినట్లున్నారు...త్వరలో అంతా సెట్ చేస్తా'నంటూ ముందుకు కదిలారు. బాధ్యతల స్వీకరణ అనంతరం డీఐజీ మీడియాతో మాట్లాడారు. అనంతపురం రేంజ్‌లో అధికారులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతామన్నారు. కేసుల దర్యాప్తు వేగవంతం చేస్తామన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, పెయిడ్ లిక్కర్ రవాణా, విక్రయంలాంటి నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. దిశ యాప్ వినియోగంపై మరింత అవగాహన తీసుకొస్తామన్నారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు కార్యాచరణ రూపొందిస్తామని, ప్రజలనూ చైతన్య వంతుల్ని చేస్తామన్నారు.

# ప్రజల మన్ననలు పొందేలా సేవలు

- శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి
- నూతన ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి




బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

**కొత్తచెరువు:** 'ప్రజల మన్ననలు పొందేలా సేవలు అందిస్తాం. పోలీసుల పనితీరులో సమూల మార్పులకు శ్రీకారం చుడతాం' అని జిల్లా నూతన ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి తెలిపారు. గురువారం ఆయన జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఎస్పీ మాధవరెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద వినాయక విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం నూతన ఎస్పీకి జిల్లా పోలీస్ యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లాకు రావడం తన అదృష్టంగా భావిస్తున్నాని పేర్కొన్నారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ఇందుకు అన్ని వర్గాల ప్రజల సహకారం తీసుకుంటానని వెల్లడించారు. జిల్లా యంత్రాంగం, పోలీస్ సిబ్బందిని సమన్వయం చేసుకొని ముందుకెళ్తామన్నారు. అదే విధంగా జిల్లాలో క్రైం, కర్ణాటక మద్యం అమ్మకాలకు ఎక్కడికక్కడే అడ్డుకట్ట వేసే విధంగా మరింత పటిష్టంగా చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు ఎస్పీ కేవీ రామకృష్ణప్రసాద్, డీఎస్పీలు భవ్యకిషోర్, హుసేన్‌పీరా, ఉమామహేశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 17న సీఎం జగన్ పర్యటన



**అనంతపురం అర్బన్:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 17న అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జగనన్న వసతి దీవెన కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ రోజు ఉదయం 9.45 గంటలు పుట్టపర్తి విమానాశ్రయానికి సీఎం చేరుకుంటారు. అక్కడి నుంచి నార్పల పర్యటనకు బయలు దేరి వెళ్తారు. తిరిగి పుట్టపర్తి విమానాశ్రయానికి మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకుంటారు. 1.40 గంటలకు విమానంలో బయలుదేరి గన్నవరం వెళతారు.

## క్లుప్తంగా

### జిల్లాను మరువలేను

• వీడ్కోలు సభలో ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్



మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

**కొత్తచెరువు:** శ్రీసత్యసాయి జిల్లాలో పని చేయడం గొప్ప అనుభూతినిచ్చిందని, ఈ ప్రాంతాన్ని తాను ఎన్నటికీ మరువలేనని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ అన్నారు. బదిలీపై మరో ప్రాంతానికి వెళుతున్న ఆయనకు గురువారం స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా పోలీసు యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, డీఎస్పీలు భవ్యకిషోర్, హుస్సేన్‌పీరా, ఉమామహేశ్వరరెడ్డి, విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### మురుగునీటిని మళ్లించండి



మురుగునీటి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

**కొత్తచెరువు:** మండల కేంద్రంలోని పుట్టపర్తి రహదారి దగ్గర చెరువు సమీపంలో కొండ కింద ఉన్న నివాసాల నుంచి మురుగు నీరు చెరువులోకి కలుస్తుండటంపై జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం చెరువులోకి కలుస్తున్న మురుగు నీటి ప్రాంతాన్ని వైద్యాధికారులతో కలసి డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. గత కొన్నేళ్లుగా డ్రైనేజీ మురుగు నీరంతా చెరువులోకి చేరుతుండడంతో నీరంతా కలుషితం అవుతోందని, ఆ నీటితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రాంతాన్ని డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. వెంటనే మురుగునీరు చెరువులోకి చేరకుండా మరో ప్రాంతానికి మళ్లించే విధంగా చర్యతీసుకోవాలని ఎంపీడీఓ, పంచాయతీ అధికారులకు సూచించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపుతామన్నారు.

## ఆకట్టుకున్న నాటకం

**పుట్టపర్తి అర్బన్:** తమిళ నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతి నిలయంలో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 5 గంటలకు వేదపఠనంతో కార్యక్రమాలను ప్రారంభించారు. సత్యసాయి మహాసమాధిని అందంగా అలంకరించారు. వేలాది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సత్య కథలు పేరుతో తమిళనాడు సత్యసాయి బాలవికాస్, సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ సభ్యులు ప్రదర్శించిన నాటకాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులకు నూతన వస్త్రాలు, జ్ఞాపికలను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ అందజేశారు.




సత్య కథలు నాటకాన్ని ప్రదర్శిస్తున్న భక్తులు

# శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట

- ఒక్కో ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామం ఒక్కో కానిస్టేబుల్‌కు దత్తత
- తరచూ సందర్శించేలా ఎస్‌ఐలకు బాధ్యత
- సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు
- మహిళలపై నేరాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించం
- దోషులకు త్వరగా శిక్షలు పడేలా కృషి
- అనంతపురం రేంజ్ కొత్త డీఐజీ అమ్మిరెడ్డి

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** అనంతపురం రేంజ్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తామని కొత్త డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. గురువారం బాధ్యతలు చేపట్టిన అనంతరం 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. అవాంఛనీయ సంఘటనలకు కారణమయ్యే వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామన్నారు. నేర ప్రవృత్తి ఉన్న వారిపై కన్నేసి ఉంచుతామని, సత్ప్రవర్తన వచ్చేవరకూ నిఘా కొనసాగిస్తామని చెప్పారు. మరికొద్ది నెలల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..



**వేగంగా శిక్ష పడేలా..**

అనంతపురం రేంజ్ పరిధిలో అనంతపురం, శ్రీ సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలున్నాయి. ఈ జిల్లాల పరిధిలో ముఖ్యంగా మహిళలు, చిన్నారుల రక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. మహిళలపై నేరాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించం. నిందితులపై కేసులు పెట్టి, వీలైనంత త్వరగా విచారణ చేసి శిక్ష పడేలా చూస్తాం. శిక్షలు వేగంగా పడటం వల్ల మిగతా వారిలో మార్పు వస్తుంది.

**సైబర్ నేరాల నియంత్రణ..**

ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా ఉన్నాయి. రోజూ వందలాది మంది బాధితులు నష్టపోతున్నారు. ఇలాంటి వాటిని అరికట్టేందుకు ప్రత్యేక మెకానిజం రూపొందిస్తాం. త్వరలో ఎస్పీలందరితో సమావేశం జరిపి చర్యలు తీసుకుంటాం. పట్టణ ప్రాంతాలో చోరీలు, పెద్ద పెద్ద దొంగతనాలు జరగకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తాం.

**ఫ్యాక్షన్ గ్రామాల దత్తత..**

రేంజ్ పరిధిలో ఫ్యాక్షన్ ప్రభావం ఉన్న గ్రామాలున్నాయి. ఈ గ్రామాలను ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కానిస్టేబుళ్లకు దత్తత ఇస్తాం. వారు తరచూ ఆయా కుటుంబాలతో మాట్లాడి అవగాహన కల్పిస్తారు. ఎస్‌ఐలు కూడా పర్యటిస్తుంటారు. ఆయా గ్రామాల్లో మంచి కుటుంబ వాతావరణం కల్పిస్తాం.

**జాతీయ రహదారులపై గస్తీ..**

అనంతపురం రేంజ్ పరిధిలో పలు జాతీయ రహదారులు ఉన్నాయి. కొన్ని రహదారులు అంతర్రాష్ట్ర అనుసంధానం కలిగి ఉన్నాయి. అలాంటి వాటిలో హైదరాబాద్–బెంగుళూరు ఒకటి. అక్రమ మద్యం, హవాలా డబ్బు రవాణాకు దీన్ని ఉపయోగిస్తున్నట్టు తెలిసింది. దీనిపై ఆయా జిల్లాల సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉంచుతాం.

**వివాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు..**

ఏడాదిలో రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కీలక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా ప్రతినియోజకవర్గంలోనూ పోలీసులకు దిశానిర్దేశం చేస్తాం. రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా ఉంటుంది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల లేని విషయాలను సృష్టించి వివాదాలు సృష్టించే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

### లీగల్ మెట్రాలజీ అధికారుల దాడులు

**చిలమత్తూరు:** మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న పలు దుకాణాల్లో తూనికలు కొలతల శాఖ అధికారులు గురువారం తనిఖీ చేశారు. వివరాలను లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్.స్వామి వెల్లడించారు. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న అనంతపురం నివాసి కిరణ్‌కుమార్ బుధవారం బస్సులో ప్రయాణిస్తూ భోజన విరామం సమయంలో కొడికొండ హోటల్ వద్ద బస్సు నిలపడంతో అక్కడి దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే రూ.3 ఎక్కువగా వసూలు చేస్తుండడం గమనించాడు. మరుగుదొడ్లు వినియోగించే వారి నుంచి రూ.5 వసూలు చేయడంపై అభ్యంతరం తెలుపగా సదరు నిర్వాహకుడు దురుసుగా వ్యవహరించాడు. ఈ విషయాన్ని విజయవాడలోని లీగల్ మెట్రాలజీ శాఖ ప్రధాన కార్యాలయానికి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం తనిఖీలు చేపట్టి అధిక ధరలు వసూలు చేస్తున్న వారిని గుర్తించి, చర్యలు తీసుకున్నారు.



# వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి

**పెనుకొండ రూరల్:** ప్రభుత్వ సంక్షేమ పాలన, సీఎం వైఎస్ జగన్ పట్ల ప్రజాదరణను ఓర్వలేక టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. దూషణలతో రెచ్చగొట్టి వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగబడుతున్నారు. పెనుకొండ మండలం కొండంపల్లిలో బుధవారం రాత్రి చోటు చేసుకున్న ఘటననే ఇందుకు నిదర్శనం. పోలీసులు తెలిపిన మేరకు... బుధవారం రాత్రి కొండంపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చేపట్టారు. గడపగడపకూ తిరుగుతూ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. ఈ నేపథ్యంలోనే శ్రీరాం నాయక్ ఇంటికెళ్లి పథకాలపై వివరించి, ఇంటి గోడకు స్టిక్కర్ అతికిస్తామని అనుమతి తీసుకున్నారు. స్టిక్కర్ అతికిస్తుండగా అక్కడకు చేరుకున్న టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి రెచ్చగొట్టడంతో ఇంటి యజమాని అసహనం వ్యక్తం చేశాడు. దీంతో స్టిక్కర్ అతికించకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు వెనుదిరిగారు. అనంతరం ఒంటిరిగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ మాజీ సర్పంచ్ భార్య రాములుబాయిపై శ్రీరాం నాయక్, అక్కిబాయి, రామాంజినాయక్, కృష్ణానాయక్, సంపత్ నాయక్, సునీతాబాయి దాడి చేసి, కమ్మలు, యాంగ్లీస్ లాక్కొని దుస్తులు చించేశారు. దాడిని ప్రోత్సహిస్తూ కులం పేరుతో రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి దూషణలకు దిగారు. ఘటనపై గురువారం పెనుకొండ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో స్థానిక వైఎస్సార్‌సీపీ మాజీ సర్పంచ్ అంజీనాయక్, నాయకులు నారాయణ యాదవ్, గోపాల్ రెడ్డి, సుబ్బిరెడ్డి, కుళ్లాయిరెడ్డి, ప్రసాదరెడ్డి, ప్రకాష్ రెడ్డి, కృష్ణమూర్తి, గృహసారథి వెంకటరెడ్డి, సచివాలయ కన్వీనర్ ఆదినారాయణ తదితరులు మాట్లాడుతూ.. టీడీపీ నాయకుల దౌర్జన్యాలను ఏకరవు పెట్టారు.



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

## ఇస్రో ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు అనుమతివ్వండి

**అనంతపురం:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రాంతీయ పరిశోధన కేంద్రాన్ని అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో ఏర్పాటు చేసేందుకు అనుమతివ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆ వర్సిటీ వీసీ ఆచార్య ఎస్ఏ కోరి అభ్యర్థించారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతిని ఆయన మర్యాదపూర్వకంగా కలసి జ్ఞాపికను అందజేశారు. వర్సిటీ అభివృద్ధిపై చర్చించారు. ఇస్రోతో పాటు భారత రక్షణ రంగ సంస్థ (డీఆర్‌డీఓ)కు సంబంధించిన ప్రాంతీయ పరిశోధన కేంద్రాలు, స్పోర్ట్స్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విన్నవించడంతో రాష్ట్రపతి సానుకూలంగా స్పందించారని గురువారం 'సాక్షి'కి వీసీ వివరించారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జ్ఞాపికను అందజేస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ ఎస్ఏ కోరి

## హాకీ క్రీడాకారుల ఎంపిక అడ్డగింత

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** స్థానిక అనంత క్రీడా గ్రామంలోని హాకీ క్రీడా మైదానంలో గురువారం చేపట్టిన జిల్లా స్థాయి సీనియర్ పురుషుల హాకీ క్రీడాకారుల ఎంపికలను న్యూ అనంతపురం హాకీ అసోసియేషన్ సభ్యులు అడ్డుకున్నారు. ఎంపిక ప్రక్రియను చేపట్టిన అసోసియేషన్‌కు ఎలాంటి గుర్తింపు లేదని వాదించారు. గుర్తింపు ఉన్న న్యూ అనంతపురం హాకీ అసోసియేషన్‌తో చర్చించకుండా దొంగచాటుగా ఎంపికలు చేపట్టడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు. గుర్తింపు ఉన్న అసోసియేషన్‌కు ఎలాంటి సమాచారం లేకుండా ధర్మవరంలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలను సైతం అడ్డుకుంటామని న్యూ హాకీ అసోసియేషన్ సభ్యులు మారుతీ ప్రసాద్, జగన్ తదితరులు హెచ్చరించారు.



క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను అడ్డుకుంటున్న అసోసియేషన్ సభ్యులు

## జిల్లాలో ముగిసిన లోకేష్ పాదయాత్ర

**తాడిపత్రి:** యువగళం పేరుతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర గురువారం జిల్లా సరిహద్దు దాటి కర్నూలు జిల్లాలోకి ప్రవేశించింది. మూడు రోజుల క్రితం తాడిపత్రి నియోజకవర్గం పెద్దపప్పూరు మండలం ప్రవేశించిన లోకేష్ పాదయాత్ర ఆది నుంచి పేలవంగానే సాగింది. పెద్దపప్పూరు, యాడికి మండలాల టీడీపీ శ్రేణుల్లో జోష్ నింపక లేకపోయింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారానికి తాము చేపట్టే చర్యలపై స్పష్టమైన హామీలను ఇవ్వకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం వైఎస్ జగన్‌ను, స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని విమర్శించేందుకే ప్రాధాన్యతనిచ్చారు. గురువారం ఉదయం యాడికి మండలం రాయలచెరువు సమీపంలోని విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర.. దైవాలమడుగు మీదుగా నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా ఆయనకు అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు, టీడీపీ హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి, జేసీ ప్రభాకరరెడ్డి, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, నాయకులు పరిటాల శ్రీరాం, అస్మిత్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు.

## మృత్యువులోనూ వీడని బంధం

- పరస్పరం ఢీకొన్న ద్విచక్ర వాహనాలు
- లారీ కిందపడి దంపతుల మృతి

**గుత్తి రూరల్:** మృత్యువు వారి బంధాన్ని విడదీయలేకపోయింది. పెళ్లి నాడు ఒకరికి ఒకరు తోడుగా ఉంటామని చేసి న బాసలు నిలబెట్టుకున్నారు. అయితే విధి ఆడి న వింత నాటకంలో ను వ్వులేక, నేనులేను అం టూ ఒకరి వెంట ఒకరు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. గుత్తి మండలం జక్కలచెరువు శివారులో 67వ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ప్రమాదంలో దంపతులు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం దంచెర్ల గ్రామానికి చెందిన నాగేంద్ర (45), రాణి (35) దంపతులు పనిపై గురువారం ఉదయం ద్విచక్ర వాహనంలో తాడిపత్రికి వెళ్లారు. పని ముగించుకుని సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. 6.30 గంటలకు గుత్తి మండలం జక్కలచెరువు వద్దకు చేరుకోగానే ఎదురుగా గుత్తి వైపు నుంచి వేగంగా దూసుకువచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. దంపతులిద్దరూ ఒక్కసారిగా రోడ్డుపై పడ్డారు. అదే సమయంలో వెనుకనే వస్తున్న లారీ వారి మీదుగా దూసుకెళ్లింది. ఘటనతో నాగేంద్ర, రాణి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనదారుడు తన వాహనాన్ని నిలపకుండా ఉడాయించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతులకు 13 ఏళ్ల మణికుమారి, 11 ఏళ్ల దీనకుమారి, 10 ఏళ్ల వయసున్న సుగుణ అనే ముగ్గురు కుమార్తెలున్నారు. తల్లిదండ్రుల మృతదేహాలను చూసి కుమార్తెలు విలపించిన తీరు చూపరులను కలచివేసింది.



మృతిచెందిన రాణి, నాగేంద్ర

### ప్రమాదంలో యువకుడి మృతి

**మడకశిర(అగళి):** అగళి మండలంలోని ఇనగలూరు–ముత్తేపల్లి గ్రామాల మధ్య గురువారం చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కరిదాసనహళ్లికి చెందిన ప్రకాష్, బసవరాజు(22) రొళ్ల వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా అగళి నుంచి అనంతపురం వైపు వెళుతున్న మడకశిర ఆర్టీసీ డిపో బస్సు ఢీకొంది. క్షతగాత్రులను తొలుత రొళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్ణాటకలోని శిరలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో బసవరాజు మృతి చెందాడు. ప్రకాష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై ఎస్‌ఐ లావణ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



బసవరాజు(ఫైల్)

### బొలెరో బోల్తా

**పుట్టపర్తి అర్బన్:** కిరాణా సరుకులతో బెంగళూరు నుంచి ధర్మవరం వెళుతున్న బొలెరో వాహనం బోల్తా పడింది. గురువారం రాత్రి పుట్టపర్తి మండలం పెడపల్లి ఈద్గా మలుపు వద్దకు చేరుకోగానే యాక్సిల్ కట్ అవడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ నాగార్జున తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రైవేట్ వాహనంలో హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయాలు కావడంతో అతని పరిస్థితి విషమంగా మారిందని వైద్యులు నిర్ధారించారు. మాచారం అందుకున్న పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ దాదాపీర్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

### రైలు కిందపడి వ్యక్తి మృతి

**హిందూపురం:** స్థానిక కొట్నూరు రైల్వేగేట్ సమీపంలో గురువారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) రైలు కిందపడి మృతి చెందాడు. రైల్వే హెచ్‌సీ ఎర్రిస్వామి తెలిపిన మేరకు... 5.5అడుగుల ఎత్తు, చామనఛాయ ఉన్న వ్యక్తి, తెల్లటి పంచ, ఎరుపు రంగు డ్రాయర్ వేసుకున్నాడు. మాసిన గడ్డం ఉంది. కుడి చేతికి దారాలు చుట్టుకున్నాడు. ఏ ప్రాంతానికి చెందిన వాడో తెలియదు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 94412 38182, 94406 27641కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

## సంపులో పడి బాలుడి మృతి

**రాప్తాడు:** ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం గాండ్లపర్తికి చెందిన బండి తిమ్మప్ప, శివమ్మ దంపతులకు ఓ కుమార్తెతో పాటు కుమారుడు యోగానంద (16) ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. గతేడాది పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన యోగానంద... ఉన్నత చదువులకు వెళ్లకుండా తండ్రికి చేదోడుగా ఉంటూ వ్యవసాయ పనుల్లో పాలుపంచుకుంటున్నాడు. గురువారం మధ్యాహ్నం పశువుల దొడ్లో ఏర్పాటు చేసిన సంప్ వద్ద పని చేస్తూ అదుపు తప్పి అందులో పడిపోయాడు. లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి మృతి చెందాడు. చాలా సేపటి తర్వాత ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు కుమారుడి మృతదేహాన్ని వెలికి తీసి బోరున విలపించారు. ఘటనతో గాండ్లపర్తిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

**పుట్టపర్తి:** బుక్కపట్నం మండలం గసికవారిపల్లి పంచాయతీ పరిధిలోని కొండాపురంలో ఈ నెల 5న నల్లప్పరెడ్డి అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. నల్లపరెడ్డిపై హత్యాయత్నం చేసిన శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి, మోహన్‌రెడ్డి, చింతలరెడ్డిని పాముదుర్తి క్రాస్ వద్ద అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

### కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లల మృతి

**అమరాపురం:** మండలంలోని హలుకూరులో కుక్కల దాడిలో కాపరి క్రిష్టప్పకు చెందిన 15 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గురువారం ఉదయం గొర్రెలను మేపునకు పొలాల్లోకి తోలుకెళుతూ మూడు గొర్రెలు, 15 గొర్రె పిల్లలను దొడ్లో వదిలి వెళ్లాడు. మధ్యాహ్నం వాటికి నీటిని, మేతను కుటుంబసభ్యులు అందించారు. సాయంకాలం ఎవరూ లేని సమయంలో వీధి కుక్కలు దొడ్లోకి చొరబడి గొర్రె పిల్లలపై దాడి చేశాయి. ఘటనలో 15 గొర్రె పిల్లలు మృతి చెందాయి. రూ.60వేల వరకూ నష్టం వాటిల్లినట్లు ఈ సందర్భంగా కాపరి క్రిష్టప్ప కుటుంబసభ్యులు తెలిపారు.



మృతి చెందిన గొర్రె పిల్లలు

### • బుడతడు.. మహా ఘనుడు




ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న చిన్నారి అయాన్ ఆహిల్

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** నగరంలోని పీటీసీలో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న బాబ్జాన్, ఆయేషా దంపతుల కుమారుడు అయాన్ ఆహిల్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. 22 నెలల వయసున్న ఈ చిన్నారి టాడలర్స్ ఎలక్ట్రిక్ కారును ఎవరి సాయం లేకుండా 1.3 కిలోమీటర్ల దూరాన్ని 18.15 నిమిషాల్లో పూర్తి చేసి, ప్రతిష్టాత్మకమైన అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. దీంతో పాటు వివిధ దేశాలకు చెందిన జెండాలను, స్వాతంత్య్ర సమరయోధుల ఫొటోలను, మానవ శరీర భాగాలను, రంగులను, 300 రకాల పక్షులను, జంతువులు, కూరగాయల పేర్లు చెప్పగలడు.



**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.